
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
మంగళవారం 30 ఏప్రిల్ 2024





లెక్క తేలింది..

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మెదక్ పార్లమెంట్ బరిలో 44 మంది
- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 19 మంది

సంగారెడ్డి టౌన్/మెదక్, ఏప్రిల్ 29 : మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించగా జహీరాబాద్ పరిధిలో 40 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. 26న జరిగిన నామినేషన్ల పరిశీలనలో 14 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 26 మంది అభ్యర్థులు మిగిలారు. 29న ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా 19 మంది బరిలో నిలిచారు. అయితే వీరిలో 10 మంది స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. ఇక రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే మెదక్ లోక్‌సభ ఎన్నికలు ప్రత్యేకంగా మారాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 44 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇంత మంది ఇక్కడి నుంచి పోటీ చేస్తుండడం ఇదే మొదటిసారి. ఇక ఈ ఎన్నిక ఖర్చు కూడా అధికంగా ఉండవచ్చునని భావిస్తున్నారు. సాధారణంగా ఒక్కోలోక్‌సభ నియోజకవర్గానికి సుమారు రూ.15 కోట్లు ఖర్చు అవుతుండగా, మెదక్ ఎన్నికలకు అదనంగా మరో రూ.10 కోట్లు ఖర్చువుతాయని సమాచారం.

జహీరాబాద్ పార్లమెంట్ బరిలో ప్రధాన పార్టీ అభ్యర్థులైన గాలి అనిల్‌కుమార్ (బీఆర్ఎస్), బీబీ పాటిల్ (బీజేపీ), సురేష్‌కుమార్ షెట్కార్ (కాంగ్రెస్), అలాగే ఆరుగురు ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు, పది మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక మెదక్ పార్లమెంట్ పరిధిలో.. పి.వెంకట్రామారెడ్డి (బీఆర్ఎస్), ఎం. రఘునందన్‌రావు (బీజేపీ), నీలం మధు (కాంగ్రెస్), ఇతర పార్టీలకు చెందిన 12 మంది అభ్యర్థులు, 29 మంది స్వతంత్రులు పోటీలో ఉన్నారు.



పైసలు లేకుండా ప్రచారం చేసేదెలా?

కాంగ్రెస్‌లో అసంతృప్తి

- గెలుపు తనదేనంటున్న మెదక్ అభ్యర్థి
- సర్వేలన్నీ తనకే అనుకూలమని ధీమా
- అసెంబ్లీ సెగ్మెంట్ ఇన్‌చార్జిల్లో మాత్రం ఆందోళన
- బీఆర్ఎస్ పోల్ మెనేజ్‌మెంట్‌పై బెంబేలు
- ప్రచార ఖర్చుపై తర్జనభర్జన
- ఒక్కో సెగ్మెంట్‌కు రూ.5 కోట్ల వరకు ఎలా సర్దుబాటు చేయాలోనని ఆవేదన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, ఏప్రిల్ 29 : ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మెదక్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అసంతృప్తి రాగాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ ప్రచారానికి వచ్చినప్పుడు హుషారుగా పాల్గొంటున్న పార్టీ నేతలు.. మిగిలిన రోజుల్లో తమ ప్రాంతాల్లో ప్రచారం చేసేందుకు వెనుకాడుతున్నారు. అడపాదడపా అసెంబ్లీ సెగ్మెంట్ ఇన్‌చార్జిలు, నాయకులు ప్రచారం చేస్తున్నా.. ఇది మొక్కుబడి తంతుగానే ఉంటున్నదని ఆ పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఆర్థిక పరమైన అంశాలేనని చెప్పుకుంటున్నారు.

ఖర్చులకు డబ్బులేవీ!

ఎన్నికల హడావుడి జోరందుకుంటున్నా ఇప్పటివరకు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ప్రచార ఖర్చుల నిమిత్తం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు డబ్బులు పంపలేదని ఈ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు కనీసం రూ.4 కోట్ల నుంచి రూ. 5 కోట్ల వరకు ఖర్చులు పెట్టుకోవాల్సి ఉంటుందని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వారం రోజుల క్రితం సెగ్మెంట్ ఇన్‌చార్జిలతో సమావేశంలో పాల్గొన్న నీలం మధు.. ప్రస్తుతానికి ప్రచార ఖర్చును భరించాలని కోరినట్టు ఓ ఇన్‌చార్జి తెలిపారు. త్వరలోనే డబ్బులు సమకూరుతాయని, రాగానే సర్దుబాటు చేస్తానని పేర్కొన్నట్టు ఆయన పేర్కొన్నారు. దీనికి సెగ్మెంట్ ఇన్‌చార్జిలు ఎవరూ బదులు మాట్లాడలేదని, డబ్బులు వచ్చిన తర్వాతే ప్రచారం చేయవచ్చని ఊరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అభిమానం ఉన్నా.. దానిని ఓట్లుగా మలుచుకోవాలంటే ప్రచారం చేయాల్సి ఉంటుంది కదా.. అని ఆయన పేర్కొన్నారు. వారం గడుస్తున్నా ఇప్పటికీ డబ్బులు అందలేదని, పైసలు లేకుండా ప్రచారం ఎలా చేయాలో తెలియడం లేదని ఆయన వాపోయారు. దాదాపు అందరు సెగ్మెంట్ ఇన్‌చార్జిలదీ ఇదే పరిస్థితి అని ఆ పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

గెలుపుపై అభ్యర్థి ధీమా..

మెదక్ పార్లమెంట్ స్థానంలో గెలుపు తనదేనని కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గమంతటా నిర్వహించిన సర్వేల్లో ఫలితాలు తనకే అనుకూలంగా వచ్చాయని ఆయన ఇటీవలే పార్టీ ముఖ్య నాయకులతో అన్నట్టు తెలిసింది. సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో కూడా తనకే అత్యధిక ఓట్లు వస్తాయని తేలిందని ఆయన అన్నట్టు పార్టీ నాయకుడొకరు చెప్పారు. సర్వేల ఫలితాలు సానుకూలంగా ఉండడంతో డబ్బులు ఖర్చు చేసేందుకు ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది.

బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్‌పై బెంబేలు

ఓవైపు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ ముందంజలో ఉన్నట్టు కనిపించినా.. ఆఖరి నిమిషంలో బీఆర్ఎస్ చేసిన పోల్ మేనేజ్‌మెంట్ వల్లే తమ అభ్యర్థి టి.జగ్గారెడ్డి ఓటమి పాలయ్యారని ఆ పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున పోటీలో ఉన్న వెంకట్రామారెడ్డి ఆర్థికంగా స్థితిమంతుడని, పైగా ఎన్నికల వ్యవహారమంతా మాజీ మంత్రి హరీశ్‌రావు చూస్తున్నారని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు హరీశ్‌రావుకు కూడా తప్పనిసరి కావడంతో ఆయన తన చతురత చూపుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు ఎలా ఉన్నా పోలింగ్‌కు ముందు హరీశ్‌రావు చేయించే పోల్ మేనేజ్‌మెంట్ తమ అభ్యర్థి జయాపజయాలను నిర్ణయించే అవకాశాలు లేకపోలేదని కాంగ్రెస్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్‌ను కట్టడి చేస్తూనే.. తాము కూడా పకడ్బందీగా పోల్ మేనేజ్‌మెంట్ చేస్తేనే విజయం సాధ్యమవుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

పకడ్బందీ ప్రచారం కోసం
కాంగ్రెస్‌లో కో-ఇన్‌చార్జిలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం పకడ్బందీగా నిర్వహించడం కోసం ఆయా నియోజకవర్గాలకు పీసీసీ కో-ఇన్‌చార్జిలను నియమించింది. రాష్ట్రంలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాలకు మాత్రమే వీరి నియామకం జరిపినట్టు తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని మెదక్ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి కొండా సురేఖ, జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనసాగుతున్నారు. అయితే మంత్రులకు ఇతర బాధ్యతలు కూడా ఉండడంతో రెగ్యులర్ ప్రచారం నిర్వహించడంలో వీరికి సమయం లభించడం లేదని పార్టీ భావించింది. ఈ నేపథ్యంలో తమ అభ్యర్థుల విజయావకాశాలు దెబ్బతినకుండా ఉండేందుకు మెదక్ పార్లమెంట్ స్థానానికి మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డిని, జహీరాబాద్ స్థానానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కో-ఇన్‌చార్జిలుగా నియమించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు అల్లాదుర్గంకు ప్రధాని మోదీ

- మధ్యాహ్నం 3 గంటలకు సభ



సిద్ధమవుతున్న సభావేదిక

అల్లాదుర్గం, ఏప్రిల్ 29: మెదక్ జిల్లాలో మంగళవారం జరగనున్న ఎన్నికల ప్రచార సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల మధ్యలో ఉన్న అల్లాదుర్గంలో నేడు నిర్వహించనున్న బీజేపీ 'విశాల్ జనసభ'లో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సభ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఐబీ చౌరస్తా వద్ద 30 ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ప్రధాని, ఇతర ముఖ్య నేతల కోసం భారీ వేదిక ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం మొత్తం మోదీ కటౌట్లు ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డితో పాటు సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ఖేడ్ బీజేపీ నాయకుడు సంగప్ప తదితరుల పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రధానమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ మూడు రోజులుగా ఇక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

అంతా..కల్తీ మయం!

- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో కల్తీ సరుకుల వినియోగం
- విషతుల్యమవుతున్న నిత్యావసర వస్తువులు
- నూనె, పండ్లు, పాలు కూడా నాసిరకమే
- సిద్దిపేటలో పెరిగిన హోటల్ కల్చర్
- కనుమరుగైన ఆహార సలహా సంఘాలు!?



సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 29: బియ్యం పిండికి రంగు కలిపితే అది పసుపు.. పాల పొడిలో నీళ్లు కలిపితే చిక్కటి పాలు.. అరటి కాడ గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్టు, రసాయనాలు రుద్దితే నిగనిగలాడే పండ్లు, నాణ్యతలేని నూనెతో బిర్యానీ, నూడిల్స్.. నాన్‌వెజ్ వేపుళ్లు అబ్బో.. ఇలా చెప్పుకుంటే పోతే కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా ఉంది. ఇదంతా సిద్దిపేట జిల్లాలో చాలాచోట్ల జరుగుతున్న కల్తీ వ్యవహారం. కొందరు వ్యాపారులు అత్యాశకు పోయి కల్తీ సరుకులు తయారు చేస్తు జేబులు నింపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో కల్తీవస్తువులను ప్రజలకు అంటగడుతున్నారు. నిత్యవసర సరుకుల ధరల పెరుగుదల కూడా ఇందుకు కారణం.

కానరాని తనిఖీలు.. నమూనాల సేకరణ

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మార్కెట్‌లో విక్రయించే నిత్యావసర వస్తువులను తరుచూ తనిఖీలు చేపట్టి నమూనాలను సేకరించాల్సి ఉంటుంది. ప్రతీ వస్తువు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నెలకు కనీసం ఆరు నమూనాలు తీసి ఎఫ్ఎస్ఎల్ (ఫుడ్ సేఫ్టీ ల్యాబొరేటరీకి) పంపించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మినహా అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నామమాత్రంగా నమూనాలు సేకరించినా.. వాటి ఫలితాలు వచ్చేసరికి కేసు నీరుగారిపోతుంది.

పెరిగిన హోటల్ కల్చర్

జిల్లా కేంద్రంగా మారిన తర్వాత సిద్దిపేటలో హోటల్ కల్చర్ బాగా పెరిగింది. ఏ చిన్న సందర్భమైనా హోటల్‌లో విందు చేసుకోవడం అధికమైంది. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు కల్తీకి పాల్పడుతున్నారు. ఇక మారుతున్న కాలానుసారం మనుషుల జీవన విధానంలోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు మొదులు కొని రోజువారి కూలీల వరకు వివిధ పనులపై బయటకు వెళ్లినపుడు అవసరాన్ని బట్టి టీ, టిఫిన్, భోజనం కోసం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, రెస్టారెంట్లను ఆశ్రయిస్తుంటారు. ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రద్దీగా కనిపిస్తుంటాయి. అయితే పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో వ్యాపారులు కల్తీ వైపు మొగ్గుచూపుతున్నారు. చాలాచోట్ల నాణ్యతాప్రమాణాలను పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రంగులను కలుపుతూ క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారణమవుతున్నారు. మరికొంత మంది అయితే మాంసం విక్రయించే వారితో భేరం కుదుర్చుకుని రోగంతో చనిపోయిన, గాయాలపాలైన వాటిని సైతం తక్కువ ధరకు కొనుగోలు చేసి వంటకాలు చేస్తున్నారు. పలువురు హోటల్ నిర్వాహకులు, వ్యాపారులు తక్కువ ధరకు లభిస్తుందని కల్తీ పదార్థాలతోనే వంటలు చేసి ప్రజలకు అంటగడుతున్నారు. సిద్దిపేట పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి జాగ్రత్తలు లేకుండానే ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. అలాగే ప్లాస్టిక్‌రహిత జిల్లాగా మార్చాలని నాయకులు, అధికారులు చెబుతున్నా... ఎక్కడా కూడా అమలు కావడం లేదు.

ఆహార సలహా సంఘాల ఊసేలేదు

ప్రజలు మోసాల బారిన పడకుండా వారిని చైతన్యం చేస్తూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు మండల, జిల్లాస్థాయి ఆహార సలహా సంఘాలను గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేది. ఈ సంఘాల సభ్యులు కల్తీ, మోసాలను అరికట్టేందుకు మూడు నెలలకొకసారి అధికారులతో సమావేశమై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా ఈ ఆహార సలహా సంఘాల నియామకం లేక నిర్వీర్యమయ్యాయి. ఇక అధికారుల నిఘా కూడా కొరవడి, వీటి ఏర్పాటును సైతం పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వినియోగదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.




ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

- శ్రీనివాస్, సిద్ధిపేట

జిల్లాలో ఏదో ఒక సందర్భంలో తనిఖీలు చేపట్టి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబోరేటరీకి పంపుతున్నారు. కానీ ఫలితాలు మాత్రం వెల్లడించడం లేదు. నాసిరకం, కల్తీ పదార్థాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆసుపత్రుల్లో రూ.వేలల్లో బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి. అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కమిటీ ఉంటేనే అధికారుల పర్యవేక్షణ సరిగా ఉంటుంది. హోటల్ నిర్వహకులు, వ్యాపారులు కూడా నాణ్యమైన సరుకులనే వాడాలి.



సిద్దిపేటలో ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, తినుబండారాల దుకాణాలు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ

గజ్వేల్, ఏప్రిల్ 29: అందరి చూపు ఆ కాలనీలపైనే పడింది. ఏ నోట చూసిన ఎన్నికల వేళ ముంపు గ్రామాల ప్రజలు ఏ వైపు నిలబడతారోనని చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లలో భూములు, ఇళ్లు, ఆస్తులు, సర్వస్వం కోల్పోయిన ప్రజలు ఏ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేస్తారోనని చర్చోపచర్చలు సాగుతున్నాయి. ముఖ్యంగా మల్లన్నసాగర్ నిర్వాసితుల ఓట్లు అధికంగా ఉండడంతో పార్టీలన్నీ ఆ కాలనీపైనే ఫోకస్ పెట్టాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వైపు నిలబడిన ముంపు గ్రామాల ప్రజలు ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ వైపు నిలబడతారా లేక బీఆర్ఎస్, బీజేపీల వైపు నిలబడతారోనని ఆయా పార్టీల నాయకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి బరిలో నిలబడడం, బీజేపీ నుంచి గతంలో దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన రఘునందన్‌రావు నిలబడడం, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి బడుగు, బలహీన వర్గాలకు చెందిన నీలం మధు ముదిరాజ్ నిలబడడంతో వారి ఛాయిస్ ఎంటోనని ఎవరికీ అర్థం కానీ పరిస్థితి ఏర్పడింది.

ఏ గట్టున ఉంటారో..?


- అందరిచూపు ముంపు గ్రామాల వైపు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులపై పార్టీల ఫోకస్

భూనిర్వాసితులవి... 15వేల ఓట్లు

మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల ఓట్లు దాదాపుగా 15వేలు ఉన్నాయి. కొండపోచమ్మసాగర్ భూనిర్వాసిత కాలనీ ములుగు మండలం తునికిబొల్లారంలో ఉండగా, మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో ఉంది. మల్లన్నసాగర్ భూనిర్వాసితుల ఓట్లు దాదాపుగా 12వేల పైచిలుకు ఉండగా, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితుల ఓట్లు 2,500 వరకు ఉన్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ వైపు నిలబడితే వారి సమస్యలు పరిష్కరిస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతుంటే, అద్భుతమైన కాలనీలు, అద్భుతమైన ప్యాకేజీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ వైపు నిలబడితే భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు తోడుగా ఉంటామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక న్యాయవాదిగా రావాల్సిన ప్రతి పరిహారంపై పోరాడుతానని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు హామీ ఇస్తున్నారు. ఇక భూనిర్వాసితుల మనోగతం ఎవరికీ అర్థం కాక ఆయా పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

గత ప్రభుత్వ మోసాలపై బీజేపీ, కాంగ్రెస్ గళం

గత ప్రభుత్వం చేసిన మోసాలను బీజేపీ, కాంగ్రెస్ నాయకులు భూనిర్వాసితులకు వివరిస్తున్నారు. భూనిర్వాసితులకు చాలా మందికి న్యాయంగా రావాల్సిన పరిహారాలను ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక బీఆర్ఎస్ నాయకులు మాత్రం దేశంలో ఎక్కడా లేని విధంగా పునరావాస కాలనీలను నిర్మించామని, అద్భుతమైన ప్యాకేజీ ఇచ్చామని చెబుతున్నారు. ఈ క్రమంలో కాలనీలకు చెందిన ఆయా గ్రామాల పెద్ద మనుషులను పిలిపించుకుని ఓటర్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు వారిని పలు దఫాలుగా కలిసి అమలు చేయాల్సిన ప్రణాళికను గూర్చి వివరించినట్లు తెలుస్తుంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయి.. పోటీలో ఉండే అభ్యర్థులు తేలడంతో భూనిర్వాసితులపై ఫోకస్ పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా భూనిర్వాసిత కాలనీల ప్రజలు ఏ గట్టుకు నిలబడతారో తేలాలంటే జూన్ 4వరకు ఆగాల్సిందే.



అన్నదాతల అభ్యున్నతే రైతు సహకార సంఘం ధ్యేయం

కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్‌గుప్తా

పాపన్నపేట, ఏప్రిల్ 29 : రైతుల అభ్యున్నతే రైతు సేవా సహకార సంఘం ధ్యేయమని కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్‌గుప్తా అన్నారు. సోమవారం కొత్తపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో డీజిల్ పంపును పునఃప్రారంభించి మాట్లాడారు. డీలర్ పంపుగా మారడంతో సొసైటీకి అధిక లాభాలు చేకూరుతాయన్నారు. ప్రజలకు సైతం ఇబ్బందులు తీరనున్నట్లు చెప్పారు.

అసమానతలకు కారణమైన
బీజేపీని ఓడించాలి

- దోపిడీకి గురికాకుండా అటో ఇటో తేల్చుకోవాలి
- ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

హుస్నాబాద్, ఏప్రిల్ 29 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కొంత మందికే దోచి పెడుతుందని ఆరోపించారు. బీజేపీపై తమకు ఎలాంటి పగలేదని, వారు అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న దోపిడీకి గురికాకుండా అటో ఇటో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. న్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కోదండరాం కోరారు.


మాట తప్పిన కాంగ్రెస్‌కు చీపుర్లతో స్వాగతం పలకాలి

- సదాశివపేట రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు



సదాశివపేటలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, హాజరైన జనం

సదాశివపేట, ఏప్రిల్ 29 : అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చి, మాట తప్పి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చిన కాంగ్రెసోళ్లకు మహిళలు చీపుర్లతో స్వాగతం పలకాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం రాత్రి సదాశివపేట పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు రూ.200 పింఛన్లను రూ.2000కు పెంచారని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, గర్భిణులకు పౌష్టికాహారం, బాలింతలకు కేసీఆర్ కిట్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో రూ.2000 పింఛన్లను రూ.4000 పెంచి ఇస్తామని మరచిపోయారన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. యువతకు నిరుద్యోగ భృతి కింద ప్రతీ నెలా రూ.4000 ఇస్తామని కాంగ్రెస్ మొండిచేయి చూపిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసి మాట తప్పారని మండిపడ్డారు. అయితే తిట్లు లేకపోతే దేవుని మీద ఒట్లు అన్నట్టుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పాలన మోసం చేసిందన్నారు. మాట తప్పిన కాంగ్రెస్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో శిక్షించాలన్నారు. బీజేపీ పార్టీ మతరాజకీయాలతో దేశ ప్రజలను చీలుస్తుందన్నారు. బీజేపీ తెలంగాణకు ఎంతో నష్టం చేసిందన్నారు. బీజేపీ తెలంగాణకు ఒక్క మెడికల్, నర్సింగ్, నవోదయ కాలేజీలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనన్నారు. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీగా ఉంటూ గంగాజమునా తహజీబ్‌ను పెంచి పోషించిందన్నారు. బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు దుబ్బాక ఎమ్మెల్యేగా 54 వేల ఓట్లతో చిత్తుగా ఓడిపోయి ఇప్పుడు ఎంపీగా వచ్చారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా చెల్లుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఎప్పుడు ఏపార్టీలో ఉంటాడో తెలియదన్నారు. నీలం మధు మూడో స్థానంకే పరిమితమవుతాడన్నారు. మెదక్ పార్లమెంట్ స్థానానికి బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి సమాజంలో ఉన్న అసమానతలు, మంచి, చెడు ఓ కలెక్టర్‌గా పని చేసిన ఆయనకు అన్నీ బాగా తెలుసునన్నారు. మెదక్ పార్లమెంట్‌ను అభివృద్ధిలో తలమానికంగా నిలిపి, కేంద్రంలో తెలంగాణ వాణిని వినిపించే శక్తి ఒక్క వెంకట్రామారెడ్డికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



రామరాజ్యం కోసం బీజేపీని గెలిపించాలి

- మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



దుబ్బాకలో నిర్వహించిన రైతు ఆత్మీయ సమ్మేళనంలో, నర్సాపూర్‌లోని ఓబీసీ మోర్చా సమ్మేళనంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

దుబ్బాక, ఏప్రిల్ 29 : ప్రధాని ప్రవేశపెడుతున్న సంక్షేమంతోపాటు రామరాజ్యం కోసం మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు కోరారు. దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రైతు సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కలెక్టర్‌గా ఉన్న సమయంలో రైతులు వరి వేస్తే ఉరి అని బెదిరించిన వ్యక్తి అని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తికి ఓటు వేస్తే రైతులకు నష్టం జరుగుతుందని తెలిపారు. తాను దుబ్బాక అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేశానన్నారు. దుబ్బాక ప్రజలు పైసలకు ఆగం కావద్దని, మళ్లీ గోసపడొద్దన్నారు. త్వరలోనే కొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపుతుందని, మళ్లీ ఆగస్టు 15న రైతురుణమాఫీ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటువేసి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కిసాన్ మోర్చ ఆయా జిల్లాల అధ్యక్షులు తిరుమల్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సంతోష్, ఎస్ఎన్‌చారి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు బీజేపీ పాలనలోనే మేలు

నర్సాపూర్, ఏప్రిల్ 29: దేశంలో అత్యధిక శాతం ఉన్న అట్టడుగువర్గాలకు బీజేపీ పాలనలో, మోదీ నాయకత్వంలోనే మేలు జరుగుతుందని ఆ పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్ గౌడ్ అధ్యక్షతన బీసీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకి అని, జవహర్‌లాల్ నెహ్రూ ఉన్న సమయంలో కాకా కోల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించారని, రాజీవ్‌గాంధీ ఉన్నపుడు మండల కమిసనర్ నివేదిక అమలుకు విముఖత చూపాడని గుర్తుచేశారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ ఓబీసీ అయిన ప్రధాని మోదీ కులాన్ని దొంగలుగా అభివర్ణించాడని విమర్శించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓబీసీ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్‌ను ఓడించి మోదీని మూడోసారి ప్రధానిగా చేసేందుకు మెదక్ నుంచి తనను ఆశీర్వదించాలని కోరారు. తాను ఎంపీగా మెదక్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎప్పుడు అండగా నిలుస్తానన్నారు. ఓబీసీ మోర్చా గ్రామగ్రామాన పర్యటించి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, పార్లమెంటు కో ఆర్డినేటర్ ప్యారసానివెంకటేశ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పి.పెద్దరమేష్‌గౌడ్ పాల్గొన్నారు



ఆశీర్వదించండి..అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- నేటి ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి
- జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్


పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 29 : మరోసారి ఆశీర్వదించి తనని గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో చీలపల్లి ఎంపీటీసీ దామోదర్, శివాయపల్లి, బూర్గుపల్లి, టెంకటి గ్రామాలకు చెందిన పలువురు యువకులు పేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ నేడు అల్లాదుర్గంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మోదీ ఆధ్వర్యంలో కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీతోనే దేశ సుస్థిర అభివృద్ధి సాధ్యమని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు మాజీ సర్పంచులు సూర్యప్రకాష్, సుధాకర్, సుభాష్, గంగారెడ్డి, శ్రావణ్, సాయిలు, వెంకయ్య, సురేందర్‌రెడ్డి, సంగమేశ్వర్, మంగలి కృష్ణ, సురేష్ సాయిలు, బుగుడాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు
రాజీనామాకు సిద్ధంగా ఉండు

- బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్‌లో అభివృద్ధి శూన్యం
- బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్‌లు ఉండవు
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కుకునూరుపల్లి, ఏప్రిల్ 29 : ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని, హరీశ్‌రావు రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచారాన్ని నిర్వహించారు. కుకునూరుపల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ హరీశ్‌రావు రాజీనామా అనంతరం సిద్దిపేట ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆమె జోష్యం చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారంటీలలో ఐదింటిని అమలు చేశామన్నారు. వెంకట్రామారెడ్డి భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాల్సింది పోయి, వారిని బెదిరించి అక్రమంగా డబ్బు సంపాదించాడని, దానితోనే ఇప్పుడు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు 100 రకాల హామీలు ఇచ్చి దుబ్బాక నియోజకవర్గంలో చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లు తొలగిస్తారని, అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తీవ్రంగా నష్టపోతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, భూంరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో సెక్టోరియల్ అధికారులే కీలకం

- ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి
- సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి.తివారి


మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులే కీలకమని ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం మాక్ పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. హ్యాండ్‌బుక్‌లోని ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలని చెప్పారు. ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజు తగు సూచనలు చేయాలని, ఎన్నికల ముందు రోజు పోలింగ్ సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి.తివారి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిబద్ధతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని ఏవైనా తప్పులు జరిగితే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్ పోలింగ్, ఈవీఎం, వీవీ ప్యాట్లను ఎలా అనుసంధానం చేయాలనే విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షకులు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుంది

- ముందుగా రెవెన్యూ డివిజన్.. డీలిమిటేషన్‌లో నియోజకవర్గం చేస్తాం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ పాలనలో రాజకీయ ముఖచిత్రం కోల్పోయిన చేర్యాల పూర్వవైభవం సంతరింపచేసేందుకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందనిమునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తాలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ముందస్తుగా రెవెన్యూ డివిజన్ చేసిన అనంతరం డీ లిమిటేషన్‌లో నియోజకవర్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ సర్కార్ అనవసరంగా, లోపభూయిష్టంగా జిల్లాలు చేసిందని మండిపడ్డారు. చేర్యాలను విచ్ఛిన్నం చేసి ప్రజలను అగాధంలో పడేసి అన్యాయం చేశారన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, జనగామతో అతడికి ఎలాంటి సంబంధం లేకపోయినా ప్యారాచూట్‌లో వచ్చి దొంగఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. పల్లాతో నియోజకవర్గానికి ఒరిగేదేమీ ఉండదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భువనగిరి పార్లమెంటు అభ్యర్థిగా పోటీకి నిలబెట్టారని, గెలిపించుకుని తీసుకురావాలని తన ఇంటికి వచ్చి కోరి తనకు అగ్నిపరీక్ష పెట్టారన్నారు. జనగామ నియోజకవర్గంతో తనకు అనుబంధం ఉందని, గతంలో తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన ప్రజలు అంతకుమించి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మెజారిటీ కట్టబెట్టి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పని ప్రదేశాల్లో
భద్రతా ఉపకరణాలు ధరించాలి

తెలంగాణ కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని


కార్యక్రమంలో పాల్గొన్న కుముదిని, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో కార్మికులు భద్రతా ఉపకరణాలను ధరించాలని తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని సూచించారు. ప్రపంచ పని భద్రత-ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో రాష్ట్రంలోని పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యూలాండ్ లేబోరేటరీస్ లిమిటెడ్ వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ దావులూరి సుచేత్‌రావు మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రత ప్రమాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన భద్రత ప్రమాణాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల డైరెక్టర్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ స్టేట్ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాల్‌రావు, ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వై.మోహన్‌బాబు, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ గౌరవ కార్యదర్శి వీవీ శశికుమార్ పాల్గొన్నారు.

హస్తం గూటికి బీఆర్ఎస్ నేత

- జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హరికిషన్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ సీనియర్ నేత హరికిషన్ కారు దిగి హస్తం గూటికి చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి జగ్గారెడ్డి సాదారంగా ఆహ్వానించారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి సేవలందించిన రాష్ట్ర నాయకుడు హరికిషన్ ఆ పార్టీలో తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదనే కారణంగా కొంతకాలం నుంచి బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటూ వచ్చారు.

కాంగ్రెస్‌లోకి
బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్

- మంత్రి దామోదర్ సమక్షంలో హస్తం గూటికి

జోగిపేట, ఏప్రిల్ 29: అందోలు-జోగిపేట పట్టణంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ఆగడం లేదు. రెండో వార్డు కౌన్సిలర్ పిట్ల భాగ్యలక్ష్మీలక్ష్మణ్ దంపతులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ నివాసంలో ఆయన సమక్షంలో వారు కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. కాగా, మున్సిపాలిటీలో 20 వార్డులకు గానూ 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా, ప్రస్తుతం ఆపార్టీ బలం కేవలం 3 స్థానాలకే పరిమితమైంది. అందోలు పట్టణంలోని 5, 6, 7 వార్డులకు చెందిన మహిళా కౌన్సిలర్లు మాత్రమే బీఆర్ఎస్‌లోనే కొనసాగుతుండగా, మిగిలిన పది మంది కౌన్సిలర్లూ ఆపార్టీని వీడడం గమనార్హం.




ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న ఎంపీటీసీలు

మిరుదొడ్డి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

మిరుదొడ్డి, ఏప్రిల్ 29: మిరుదొడ్డి ఎంపీపీ గజ్జల సాయిలుపై అవిశ్వాస తీర్మానపత్రాన్ని సోమవారం సిద్దిపేట ఆర్డీవో సదానందంకు మిరుదొడ్డి మండలపరిషత్ ఉపాధ్యక్షుడు రాజులు ఎంపీటీసీలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీటీసీలకు తెలియకుండా మండల పరిషత్ నిధులు మంజూరు చేయవద్దన్నారు. ఎంపీపీ గజ్జల సాయిలుకు ఎంపీటీసీలంటే గౌరవంలేకుండా పోయిందన్నారు. అలాగే మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డికి కూడా ఎంపీపీపై అవిశ్వాస తీర్మానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు లలిత, లక్ష్మీ, శ్రీనివాస్, నర్సింహులు, భాగ్యలక్ష్మి, రాజవ్వ, కోఆప్షన్ సభ్యుడు హైమద్ తదితరులున్నారు.

మే 2న మెగాజాబ్ మేళా

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 29: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 2న ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హెటిరో లాబొరేటరీస్ కంపెనీ కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హెటిరో లాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు 2020 నుంచి 2024 వరకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ డిగ్రీలో కెమిస్ట్రీ, బీఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు మాత్రమే అర్హులని కళాశాల తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ డా. ఇమ్మడి శ్రీనివాస్ రావు, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. వాసం శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో కళాశాలలోని ఓల్డ్ కాన్ఫరెన్స్ హాల్‌లో మే 2న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309965743 నెంబర్ ని సంప్రదించాలన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

● సిద్దిపేట డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 29: జిల్లాలోని వైద్య సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో జిల్లాలోని ఆశా కార్యకర్తలతో కలిసి డీఎంహెచ్‌వో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఆరోగ్య కార్యక్రమంలో అందరూ పాలు పంచుకోవాలని, ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల నమోదు దగ్గర నుంచి ప్రసవమయ్యేంత వరకు, వివిధ ఆరోగ్య కార్యక్రమాలు ఎన్సీడీ తదితర కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎంవోలు శేష, పద్మ, క్యాథరిన్, చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజినీ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ వినోద్‌బాబ్జీ, డాక్టర్ శ్రీదేవి, రవీందర్‌రెడ్డి ఏవో, డేనియల్, సత్యనారాయణ, సోఫాన్, రాజేందర్, డెమో నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్



మాట్లాడుతున్న సహపరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి

వరి 'వెద' సాగుతో మంచి లాభాలు

● ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, సహపరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 29: మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో వెదసాగు విధానం ద్వారా సాగుచేసి మంచి దిగుబడులు సాధించిన రైతుల పొలంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయవ్యవసాయ పరిశోధనాస్థానం, సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కూలీల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వరిసాగులో వెదజల్లే పద్ధతి ద్వారా కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చును కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఈ పద్ధతిపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారని ఉమారెడ్డి తెలియజేశారు. యాసంగిలో వరికి బదులుగా నూనె గింజ పంటలు, కూరగాయలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. మర్కుక్ దాదాపు 605 ఎకరాల్లో వెదజల్లే పద్ధతి ద్వారా సాగు చేసినట్టు తెలిపారు. వరిలో విత్తనం వెదజల్లే పద్ధతితో రైతాంగానికి అనేక లాభాలున్నాయన్నారు. వెద జల్లే పద్ధతి ద్వారా రైతుకు కూలీల అవసరం ఉండదని, కేవలం కుటుంబ సభ్యులతో రోజుకు మూడెకరాల వరకు విత్తనం వేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం మాత్రమే అవసరమవుతుందన్నారు. ఈ విధంగా ఎకరాకు రూ. 6వేల నుంచి రూ. 8 వేల వరకు ఖర్చు రైతుకు మిగులుతుందని వివరించారు. ఏరువాక శాస్త్రవేత్తలు విజయ్, డా. పల్లవి మాట్లాడుతూ కలుపు యాజమాన్యంలో తప్పనిసరి జాగ్రత్తల గురించి వివరించారు.

ఒక గుంట విస్తీర్ణంలో చేపట్టిన పంట కోత ప్రయోగం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ఎన్‌పీ-9153 పుష్కల్ రకం, డిసెంబర్ 27,2023న విత్తగా 124 రోజుల తర్వాత ఎకరాకు 34.2 క్వింటాళ్ల వరకు దిగుబడి అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణువర్ధన్, రజినీకాంత్, భానుశ్రీ, రైతులు, నూజివీడు కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ


జగదేవ్‌పూర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29: బార్డర్ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న బార్డర్ చెక్‌పోస్టును ఏసీపీ పురుషోత్తంరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మూడు షిఫ్టులుగా 24 గంటలు విధులు నిర్వహించాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి

తొగుట, ఏప్రిల్ 29: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తొగుట మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి ఏర్పాటు చేయడంతో పాటు కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌ను ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీని ప్రధానమంత్రిని చేసిన ఘనత బీజేపీదే

గజ్వేల్, ఏప్రిల్ 29: బీసీని ప్రధానమంత్రిని చేసిన ఘనత బీజేపీదేనని బీజేపీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి, యెల్లు రాంరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు దువ్వల రాజుయాదవ్, పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా పట్టణకమిటీని ప్రకటించారు. ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా సంగెపు అనిల్, కాశబోయిన రమేశ్, చిక్కుడు ప్రసాద్, శ్యాంబాయిగారి కనకయ్య, కొండకింది రమేశ్, దీకొండ కైలాసం, ప్రధాన కార్యదర్శులుగా గొడుగు శ్రీకాంత్, కొర్ల సూర్యారావు, గుర్రాల కార్తీక్, కార్యదర్శులు రేవంతుల సురేశ్, తుప్పాటి నరేశ్, కాల్ల సాయికుమార్, కొండా రవి, సిరిసిల్లా నవీన్‌కుమార్, పెద్దూరి భాస్కర్, కోశాధికారిగా శివలింగు కరుణాకర్, సోషల్‌మీడియా విభాగానికి కొండకింది ఉపేందర్, శివలింగు బాల్‌రాజు, అధికార ప్రతినిధిగా వేమూరి వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా బొండ్ల రమేశ్, మాదగారి స్వామి, దుద్దెడ నరేశ్, చిక్కుడు భగవాన్, చీర్ల స్వామి యాదవ్, కేదారి, గొడుగు రాజు, బాలకిషన్, నాగులపల్లి రాంచందర్, బొనాల నవీన్‌ను ప్రకటించారు.

గుండె పోటుతో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడి మృతి


పరశురాములు (ఫైల్)

చిన్నకోడూరు, ఏప్రిల్ 29: మండలంలోని రామంచ గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎర్ర పరశురాములు (55) సోమవారం గుండె పోటుతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి, గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటానన్నారు.

మే1న మండల సమావేశం

మద్దూరు, ఏప్రిల్ 29: మే1న మద్దూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 29: శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా అవసరమని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలోని సెయింట్‌పాల్స్ పాఠశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నేతి కైలాసం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉచిత శిక్షణ శిబిరం మే 25 వరకు కొనసాగనున్నట్టు చెప్పారు. విద్యార్థులు వేసవి కాలంలో సమయాన్ని సద్వినియోగం చేసుకొని, సాఫ్ట్‌బాల్ నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పాఠశాల చైర్మన్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ శారీరక మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. 8 ఏళ్ల పైబడిన విద్యార్థులకు కోచ్ నవీన్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్‌లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తోట సతీష్, వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు బాబు పాల్గొన్నారు.


సిద్దిపేటలో సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు


గజ్వేల్‌లోని సీతారామ ఉమా మహేశ్వర ఆలయం, (ఇన్‌సెట్‌లో) ఆలయంలో కొలువైన సీతారాములు

నేటి నుంచి గజ్వేల్‌లో బ్రహ్మోత్సవాలు

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 29: గజ్వేల్ పట్టణంలోని పురాతన సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30 నుంచి మే 5వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వస్తివాచనము, బుధవారం ఉదయం వాసుదేవ పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, గురువారం ఉదయం నిత్యపూజ విధులు, సాయంత్రం స్వామి వార్ల ఎదుర్కోలు, రాత్రి శ్రీ సీతారామ ఉమామహేశ్వరుల కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి నిత్య పూజా విధులు, సాయంత్రం పొన్న సేవ, నందివాహనసేవ ఉంటాయని. శనివారం ఉదయం నిత్యపూజా విధులు, అగ్నిగుండాలు, గరుడ సేవ, పట్టణంలో ఊరేగింపు. ఆదివారం తెల్లవారు జామున శ్రీ స్వామివారి పుష్పరథోత్సవం, నిత్య పూజావిధులు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాలకు రావాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను అందజేశారు.

కనులపండువగా బీరప్ప కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో భక్తులు, బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు, ఏప్రిల్ 29: మండలంలోని లద్నూరులో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామంలోని ఎల్లమ్మ బావిలో వేసిన లింగాలను కుర్మసంఘం ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల మధ్య తరలివెళ్లిన గ్రామస్థుల సమక్షంలో వెతికి తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. సోమవారం ఆలయం ఆవరణలో బీరప్పకామరతి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి బోనాలు సమర్పించారు. కల్యాణమహోత్సవంలో కుర్మ సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు, మద్దూరు, ధూళిమిట్ట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం


ఊరేగింపుగా జలకడవలు తీసుకెళ్తున్న మహిళలు

చేర్యాల, ఏప్రిల్ 29: కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో గౌడకులస్థుల ఆరాధ్యదైవమైన రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్ల దరువులు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు గ్రామంలోని ప్రధానవీధుల గుండా జలకడవలను తీసుకువచ్చి పుట్టకమ్మడం నిర్వహించారు. అనంతరం కాటమయ్యకు మొక్కులు చెల్లించుకొని, గంగతెప్ప కార్యక్రమం జరిపారు.

మే డే వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటం పెట్టాలి

చేర్యాల, ఏప్రిల్ 29 : కార్మికులకు హక్కులు కల్పించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని మే డే వేడుకల్లో నెలకొల్పాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం చేర్యాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగా కార్మికులకు తమ హక్కులు దక్కుతున్నాయన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి తరఫున ఇంటింటి ప్రచారం


మర్కుక్: వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 29: సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడక, పుల్లూరు, బచ్చాయిపల్లి, దమ్మచెరువు గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పాపన్నగారి సురేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఘర్ ఘర్ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ఆలోచనావిధానాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘునందన్‌రావు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడెపు యాదగిరి, శ్రీకాంత్, భూపాల్ రెడ్డి, బోయిని సురేష్, కమ్మ శ్రీను, లింగాల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● **మర్కుక్:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మోదీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించే కరపత్రాలను గడపగడపకూ పంచుతూ ప్రచారం చేశారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డిరాంరెడ్డి, ఉపాధ్యక్షులు కొమురయ్య, కుంట సత్యం, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **చేర్యాల:** కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చాల, లెనిన్‌నగర్ గ్రామాల్లో సోమవారం బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కొమురవెల్లి మండల ఉపాధ్యక్షుడు వంగ శివారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** బీజేపీ కరీంనగర్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట స్వరూప, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, బోగ మహేశ్, విద్యాసాగర్, సంతోష్, అనంత స్వామి తదితరులున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ రాకతో కష్టాలు మొదలయ్యాయి

● పలు మండలాల్లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం


ములుగు: శ్రీరాంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

ములుగు, ఏప్రిల్ 29: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైరన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శ్రీరాంపూర్, నర్సాపూర్ గ్రామాల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్‌తో కలిసి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా సమయాన్ని వృథా చేస్తుందన్నారు. రాష్ట్రంలో తాగునీటి ఇబ్బందులను కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అర్జున్‌గౌడ్, నాయకులు గంగిషెట్టి గణేష్‌గుప్తా, ఎంపీటీసీ నవ్యశ్రీరాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, గజ్వేల్ మండలం దాచారంలో జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో ప్యాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణాగౌడ్, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, మద్దిరాజిరెడ్డి, నవాజ్‌మీరా, కరీం తదితరులు ఉన్నారు.

● **మర్కుక్:** బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని యూసుఫ్‌ఖాన్‌పల్లి, గంగాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మర్కుక్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మండలంలోని మద్దూర్‌లో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రిప్పలస్వామి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఆదిరాములు, నర్సింహులు, సాయిరెడ్డి, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు అనంతల ప్రశాంత్, రాగల దుర్గయ్య తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

మాయమాటలతో వంచిస్తున్న ప్రభుత్వం

తొగుట, ఏప్రిల్ 29: మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచనకు గురిచేస్తున్నదని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలోని బీరప్ప ఆలయం ఉత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని చెప్పి ఇంతవరకు పట్టించుకోని ప్రభుత్వం మళ్లీ డోకాబాజీ మాటలతో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ వచ్చి మన బాధలు తీరుస్తాడని.. ప్రజలు అధైర్య పడకుండా బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆలయాల అభివృద్ధి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఏ గ్రామంలో చూసినా గ్రామ దేవతల పండుగలతో కళకళలాడుతుందన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించిన తొగుట గ్రామానికి చెందిన సుతారి కావ్య ఇంటికి వెళ్లి ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, ఎంపీటీసీలు సుతారి లలిత రమేష్, వేల్పుల స్వామి, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు బక్క కనకయ్య, వెంకట్‌గౌడ్, భాస్కర్, ప్రవీణ్, మంగ యాదగిరి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీరప్ప ఉత్సవాల్లో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే

బెస్ట్ అంత్రపెన్యూర్ అవార్డు అందుకున్న వినోద్


అవార్డు అందుకుంటున్న వినోద్

చేర్యాల, ఏప్రిల్ 29 : చేర్యాల పట్టణానికి చెందిన బొడ్డు వినోద్ బెస్ట్ అంత్రపెన్యూర్ అవార్డు అందుకున్నారు. లైఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న వినోద్ హైదరాబాద్‌లో కొంతకాలంగా విన్ పాలిటిక్స్ పేరిట ఎక్సెల్ డిఫెన్స్ అకాడమీ స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నారు. సంబంధిత రంగంలో వినోద్ రాణించడాన్ని గుర్తించిన వీ-ఈవెంట్స్ సంస్థ నిర్వాహకులు బెస్ట్ అవార్డుకు ఎంపిక చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని కత్రినా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అవార్డు, మెమెంటోను అందించారు.

కరాటే జాతీయస్థాయి సెమినార్‌లో జిల్లా ఇన్‌స్ట్రక్టర్ల ప్రతిభ


జపాన్ ఇన్‌స్ట్రక్టర్‌తో ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లావాసులు

చేర్యాల, ఏప్రిల్ 29: జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం కొల్లంలో రెండురోజులుగా నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌లో సిద్దిపేట జిల్లా ఇన్‌స్ట్రక్టర్లు, చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జిల్లా సెన్సాయి ఎంఎస్ పాషా తెలిపారు. సోమవారం ఆయన చేర్యాలలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తరఫున సెమినార్‌కు హాజరైన 8మంది పోటీలో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. జపాన్ సెన్సాయ్ మినిస్ట్రీ ఆఫ్ జపాన్ ఇన్‌స్ట్రక్టర్ ఇనాడా చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆయిల్‌పామ్ డిప్యూటీ మేనేజర్

మిరుదొడ్డి, ఏప్రిల్ 29: ఆయిల్ పామ్ రైతులు జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చునని ఆయిల్‌పామ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీన్‌రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డిలోని రైతు తోట అంజిరెడ్డి ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ మొక్కలకు సరైనా నీటిని అందించడం ద్వారా దిగుబడి ఎక్కువ దిగుబడిని పొందవచ్చన్నారు. మొక్కలకు డ్రిప్ ద్వారా నీటిని అందించాలని సూచించారు. ఆయిల్‌పామ్ రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఆయన వెంట ఆయిల్‌పామ్ జిల్లా ఇన్‌చార్జి శంకర్, ఉద్యానవన అధికారి అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ అంజనేయులు తదితరులున్నారు.

కార్మికుల పోరాట స్ఫూర్తికి నిదర్శనం మేడే


బండ్ల స్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 29: శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకోవడానికి లక్షలాది కార్మికుల గొంతుకలు ఒక్కటైన చరిత్రకు సాక్ష్యం మేడే అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి పేర్కొన్నారు. సోమవారం అయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ... 1886 అమెరికాలో షికాగో నగరంలో మే 1న వందలాది మంది కార్మికులతో ప్రారంభమైన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవడానికి నేడు ప్రపంచ వ్యాప్తంగా మేడేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. ఆనాడు సాధించుకున్న హక్కులను నేటి పాలకులు తుంగలో తొక్కి పని గంటలను పెంచి శ్రమ దోపిడీకి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఐక్యతతో తిప్పికొట్టాలన్నారు. గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల వద్ద, కార్మికుల కార్యాలయాల వద్ద మే 1న జెండాలు ఎగురవేయడం ద్వారా కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ

గజ్వేల్, ఏప్రిల్ 29: లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌కు చెందిన గుడాల నారాయణ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రాలను సేకరించి, గజ్వేల్ ఐ ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య మాట్లాడుతూ అంధత్వంతో బాధపడే వారికి నేత్రాలను అందజేస్తే కంటి చూపును ఇచ్చిన వారమవుతామన్నారు. వారితో సభ్యులు నంగునూరి సత్యనారాయణ, వెంకటేశ్, కిరణ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.